## క్లుప్తంగా

### రోడ్డు మరమ్మతులకు ఆదేశాలు



రోడ్డును పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, కలెక్టర్ నాగరాణి

**భీమవరం (ప్రకాశంచౌక్):** కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆర్టీసీ డిపో వెనుక బైపాస్ రోడ్డును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు మరమ్మతుల విషయమై భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డికి తగు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

### పారిశుద్ధ్య కార్మికులకు రగ్గుల పంపిణీ



వివరాలు వెల్లడిస్తున్న బాబు, డాక్టర్ కృష్ణవంశీ

**భీమవరం:** స్థానిక ఆదర్శనగర్‌లో బుధవారం అల్లూరి వెంకట రాఘవరాజు చారిటబుల్ ట్రస్ట్, ఉచిత యోగ ధ్యాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ పీవీఎస్ఎస్ఎస్ రాజు (డీటీడీసి బాబు), డాక్టర్ అల్లూరి కృష్ణవంశీ తెలిపారు. మంగళవారం భీమవరంలో విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, యోగ, ధ్యానం మన శరీరానికి ఎంతో అవసరమన్నారు. ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరంతరం వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహించనున్నామని, కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా భీమవరంలోని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్స్ పంపిణీ చేస్తున్నామన్నారు.

### రగ్గుల పంపిణీ

**భీమవరం:** స్థానిక లెప్రసీ కాలనీలో మంగళవారం 126 మంది లెప్రసీ వ్యాధిగ్రస్తులకు మంగళవారం వేగేశ్న రవి ఆధ్వర్యంలో రగ్గులు పంపిణీ చేశారు. అధ్యక్షుడు వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ

**భీమవరం:** బీజేపీ యువ మోర్చ అధ్యక్షుడు కలిదిండి వినోద్ కుమార్ వర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరాన్ని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రారంభించారు. 2024 పారిస్ ఒలింపిక్స్ రన్నింగ్‌లో పాల్గొన్న నరసాపురం పట్టణానికి చెందిన దండి జ్యోతికను సన్మానించి, రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, పార్టీ నాయకులు ఆకుల లీలాకృష్ణ, కాయిత సురేంద్ర, అరసవల్లి సుబ్రమణ్యం, కోమటి రవికుమార్, ఆడబాల శివ, మొహిద్దీన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

### బాలా త్రిపుర సుందరీదేవికి ప్రత్యేక పూజలు

**భీమవరం (ప్రకాశంచౌక్):** స్థానిక మెంటేవారి తోటలోని శ్రీ బాలత్రిపుర సుందరీదేవి దేవాలయంలోని పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రార్చన, పలు రకాల పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కాశీభట్ల మణికంఠ, వారణాసి హనుమ శర్మ కొమ్ము శ్రీనివాస్ అధ్వర్యంలో దాతలు వాసంశెట్టి చంద్రశేఖర్, సీతలక్ష్మి దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించి, అమ్మవారికి పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

### చిరు ధాన్యాలతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

**భీమవరం అర్బన్:** పోషకాలు అధికంగా ఉండే చిరు ధాన్యాలు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలని భీమవరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.అనిల్ కుమారి అన్నారు. భీమవరం మండలంలో గొల్లవానితిప్పలోని అంగన్‌వాడీ కేంద్రం-4లో పోషకార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.సూపర్‌వైజర్ అనిల్ కుమారి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ రోగాల బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, టీఎల్ఎం తాయారు, తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం




మహదేవపట్నంలో స్వచ్ఛత హి సేవలో సర్పంచ్ సుబ్బలక్ష్మిశ్రీనివాస్, అధికారులు, విద్యార్థులు



మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఉండి:** మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకునేందుకు పాటుపడదామని మహదేవపట్నం సర్పంచ్ వనిమా సుబ్బలక్ష్మిశ్రీనివాస్ అన్నారు.దేశ ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజు నుంచి మహాత్మాగాంధీ పుట్టిన రోజు అనగా అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించే స్వచ్చత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామ సడిబొడ్డులో విద్యార్థులు, ఉద్యోగులతో మానవ హారం ఏర్పాటు చేసి పరిశుభ్రత, పారిశుధ్యంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వనిమా శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కే పవన్‌కుమార్, వీఆర్వో ఎస్ చిన్నారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల ర్యాలీ**

**వీరవాసరం:** స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం వీరవాసం మండల వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు, మానవ హారాలు ఏర్పాటు చేశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, వైస్ ఎంపీపీ అద్దాల శ్రీరామచంద్రమూర్తి, గెడ్డం భారతి, గెడ్డం భాస్కరరావు, వేండ్ర లీలా కృష్ణ, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గుమ్ములూరు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

**పరిశుభ్రతతోనే ఆరోగ్యం**

**ఆకివీడు:** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా, ఆహ్లాదకరంగా జీవించవచ్చని నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు అన్నారు. స్థానిక గుమ్ములూరు సెంటర్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులు, సచివాలయాల సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బంది మానవ హారంగా ఏర్పడి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో పరిసరాలను అంతే శుభ్రంగా ఉంచుకోవాలని పుప్పాల పండు అన్నారు. కమిషనర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ వచ్చే నెల రెండవ తేదీ వరకూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు ఎండీ.జక్కీ, గుండుగొలను సావిత్రీ, మన్నే లలితాదేవి, మేనేజర్ వెంకటేశ్వరరావు, ఏఈ సురేష్, టీపీఎస్ రాధాకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**బొండాడలో స్వచ్ఛతా హీ సేవ**

**కాళ్ల:** గ్రామాల పరిశుభ్రత ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలని బొండాడ సర్పంచ్ మన్నే నాగరాజు తెలిపారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మానవహారం నిర్వహించారు. 17వ తేదీ నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలో అన్ని గ్రామాలను ఆయా పంచాయతీ కార్యాలయాలు పాఠశాలల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మన్నే నాగరాజు, మేక వెంకన్న బాబు, ఎం కష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి స్కూల్ గేమ్స్ ఎంపికలు

**వీరవాసరం:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో వీరవాసరం అండర్-14, అండర్-17 బాల బాలికల మండల స్థాయి ఆటల పోటీల ఎంపికలు ఎంఆర్‌కే జెడ్పీ హైస్కూల్ వీరవాసరం క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తారని హెచ్ఎం జె.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. అండర్-14 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 1.1.2011 లేదా తర్వాత జన్మించి ఉండాలన్నారు. అండర్-17 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 1.1.2008 లేదా తర్వాత జన్మించి ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు వీరవాసరం మండల కో-ఆర్డినేటర్ పూడి శ్రీనివాస్ 80962 75278, బీవీ శ్రీనివాస్ 73967 36187ను సంప్రదించాలని కోరారు.

### వ్యక్తిపై దాడి

**పాలకోడేరు:** గణేష్ నిమజ్జనోత్సవాల సందర్భంగా పాత కక్షలను పురస్కరించుకుని, విస్సా కోడేరులో తనపై దాడి చేశారంటూ బొల్లం వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొల్లం త్రిమూర్తులు, శివ కృష్ణ, కోలా దుర్గాప్రసాద్, తానాల దుర్గాప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఏఎస్సై ఎన్.హరిబాబు తెలిపారు.

### పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**భీమవరం (ప్రకాశంచౌక్):** సెప్టెంబర్ 27 ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని 2023-24 కు గాను ప్రకటించిన వివిధ అవార్డులకు అర్హులైన పర్యాటక రంగాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి కేఏస్ ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు.దరఖాస్తులను విజయవాడలో ఈ నెల 22లోపు అందజేయాలని కోరారు. వివరాలకు 6309942024 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# నిబంధనల మేరకే డ్రెయిన్ నిర్మాణం

**నాణ్యత ప్రమాణాలు భేష్ : ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ**

**ఆకివీడు:** పక్కా డ్రెయిన్ నిర్మాణంలో అవకతవకలు చోటు చేసుకున్నాయని, సక్రమంగా నిర్మించలేదని లోకాయుక్తకు అందిన ఫిర్యాదు మేరకు ఉమ్మడి జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎన్‌వీవీ సత్యనారాయణ మంగళవారం విచారణ చేశారు. మండలంలోని సిద్ధాపురం గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం పథకం ద్వారా మంజూరు అయిన రూ.14 లక్షలతో హరిజనపేటలోని 2,3 వార్డుల్లో పక్కా డ్రెయినేజీని నిర్మించారు. నిర్మాణ పనుల్లో అవకతవకలున్నాయని, ఎత్తుగా నిర్మించారని, ఉపయోగకరంగా లేదని గ్రామానికి చెందిన కూటమి నాయకుడు నున్న బలరాముడు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే డ్రెయిన్‌పై పలు ఫిర్యాదులు అందగా మండల, డివిజన్ స్థాయి అధికారులు పరిశీలించారు. అవకతవకల్ని బయట పెట్టడంలేదని ఆయన లోకాయుక్తకు ఫిర్యాదు చేయడతో ఉమ్మడి జిల్లా ఆర్ డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎన్‌వీవీ సత్యనారాయణ, క్వాలిటీ కంట్రోల్ డీఈ,ఆర్‌డబ్ల్యూస్ ఈఈ, డీఈఈ, ఏఈఈలు గ్రామంలోని నిర్మించిన డ్రెయిన్‌ను పరిశీలించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు నాణ్యత ప్రమాణాల్ని పరిశీలించారు. ప్రజల సమక్షంలోనే నాణ్యత ప్రమాణాలు భేష్‌గా ఉన్నాయని అధికారులు ప్రకటించారు. రోడ్డు లెవెల్ కంటే డ్రెయిన్ గోడలు ఎత్తుగా నిర్మించడం వల్ల మురుగు నీరు పంట కాలువలోకి చొచ్చుకెళ్లకుండా ఉంటుందని తెలిపారు. డ్రెయిన్ నిర్మాణం వల్ల ఇబ్బందులున్నాయా అని అక్కడున్న ప్రజల్ని ప్రశ్నించగా వర్షం నీరు రోడ్డుపై నిలుస్తోందని, డ్రెయినేజీలో మురుగు నీరు సక్రమంగానే వెళుతోందని తెలిపారు. డ్రెయిన్ నిర్మాణం తరువాతే రోడ్డు నిర్మించాల్సి ఉందని, ఆ ప్రకారంగా రోడ్డు నిర్మాణానికి మండల గ్రాంటు మంజూరైనట్టు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు భూపతిరాజు బుజ్జిరాజు అధికారులకు వివరించారు. రోడ్డు నిర్మాణం పూర్తి అయితే డ్రెయినేజీ ఉయోగం మరింత పెరుగుతుందని చెప్పారు. ఇదే విషయాన్ని గ్రామస్తులుకూడా అధికారులకు తెలియజేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ వెంట ఈఈ బీ.వీ. నాగేశ్వర రావు, డీఈఈ ధనానంద్, క్వాలిటీ కంట్రోల్ ఏలూరు డీఈఈ వెంకటేశ్వరరావు, ఏఈ సత్యనారాయణ, గిరి, మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ పార్వతి, ఈఓపీఆర్డీ సుబ్బారావు, కార్యదర్శి సతీష్, పలువురు స్థానికులు పాల్గొన్నారు.



సిద్ధాపురంలో గడపగడపకూ మన ప్రభుత్వ నిధులతో నిర్మించిన డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, డీఈ, ఏఈలు

# సమాజానికి మార్గదర్శకులుగా ఉందాం

**ఉండి:** ప్రతి క్రైస్తవుడు ఏసుక్రీస్తు చూపించిన ఆధ్యాత్మిక మార్గంలో జీవించి సమాజానికి ఆదర్శంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్రాధ్యక్షుడు మేడిద జాన్సన్ అన్నారు. ఉండి అరుంధతీపేటలో మంగళవారం యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ (యూపీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా యూపీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసారు.అధ్యక్షుడుగా రెవరెండ్ సోడదాసి పీటర్, గౌరవాధ్యక్షుడు క్రైస్తవరత్న జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఈలీ డేవిడ్‌మార్క్, ఉపాధ్యక్షుడు రెవరెండ్ కొత్తపల్లి మెల్కీసెదక్, కార్యదర్శి ములపర్తి యోనాతాను, జాయింట్ సెక్రటరీ మాదాసి రవికుమార్, కోశాధికారి రాపాక జయరాజు, సలహాదారులుగా కాలా యోహాను, గోడి యోసేపు నియామకమయ్యారు.18వ తేదీ అనగా బుధవారం నుంచి నూతన కమిటీ బాధ్యతలు చేపడుతుందని తెలిపారు. అనంతరం జాన్సన్ మాట్లాడుతూ క్రైస్తవులు, పాస్టర్లు, సేవకులు సమాజక్షేమం కోరే ప్రతినిధులుగా ఉండాలని అన్నారు. వచ్చే నెలలో మండలంలోని పెదపుల్లేరు బెరాకా ప్రార్థనా మందిరంలో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత కమిటీ అధ్యక్షుడు దేవ వరదానం, ఉపాధ్యక్షుడు బి జోసఫ్, కార్యదర్శి కే ఎలీషా, సంయుక్త కార్యదర్శి ఎన్ యోహాను, కోశాధికారి డీ సువర్ణరాజు, మార్టిన్‌లూథర్ పాల్గొన్నారు.



ఉండిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మేడిద జాన్సన్

## జువ్వలపాలెం ఘటనలో నలుగురిపై అట్రాసిటీ కేసు

**కాళ్ల:** జువ్వలపాలెంలో సోమవారం రాత్రి గణేశ్ నిమజ్జనం సందర్భంగా తలెత్తిన ఘటనకు సంబంధించి నలుగురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు కాళ్ల ఎస్సై ఎస్.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి యుత వాతావరణం ఉండే విధంగా ముందస్తుగా చర్యల్లో భాగంగా నాలుగు రోజుల పాటు పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. బాధితుణ్ని పరామర్శించిన దళిత సంఘాల నేతలు జువ్వలపాలెం ఘటనలో బాధితుడైన కాళ్లకూరు గ్రామానికి చెందిన ఈదా యాకోబును దళిత సంఘాల నేతలు మంగళవారం పరామర్శించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ కోనా జోసెఫ్, ఎస్సీ,ఎస్టీ, బీసీ బహుజన సమాఖ్య జిల్లా కార్యదర్శి గుడిసె అనిల్‌కుమార్, రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు.



జువ్వలపాలెంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసిన దృశ్యం

## పేదల సొంతింటికి పీఎం ఆవాస్ యోజన

**భీమవరం:** పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ప్రారంభిస్తున్నట్లు కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. మంగళవారం భీమవరం పట్టణానికి చెందిన విస్సాకోడేరు లేఅవుట్‌లో జగనన్న కాలనీలో నిర్మించిన ఇంటిని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదల ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, హౌసింగ్ అధికారులు, పళ్ల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

## శక్తి వనరుల వినియోగానికి అధిక ప్రాధాన్యత

**భీమవరం:** ప్రపంచ వ్యాప్తంగా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల తగ్గింపు, శక్తి వనరుల సమర్థవంతమైన వినియోగానికి ఎంతో ప్రాధాన్యత ఉందని ఇటువంటి పరిస్థితుల్లో ఉష్ణశక్తి నిల్వ, మార్పిడి కీలకమైన సాంకేతికగా ఉద్భవించిందని జపాన్ యూనివర్శిటీ ప్రొఫెసర్ సుచితోరీ అన్నారు. భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ థర్మల్ ఎనర్జీ సిస్టమ్స్ ప్రొడక్షన్, స్టోరేజ్ అండ్ ట్రాన్స్‌ఫర్ అనే అంశంపై ఐదు రోజుల అంతర్జాతీయ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ మంగం వేణు మాట్లాడుతూ ఆధునిక థర్మల్ ఎనర్జీ సిస్టమ్స్‌పై ఉన్నత స్థాయి పరిజ్ఞానం ఫ్యాకల్టీకి అందించడం, పరిశోధనల కోసం ప్రపంచ స్థాయి నిపుణుల సూచనలు స్వీకరించడం, పరిశోధనల్లో భాగస్వాములను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ సాయి సుధీర్, అనిల్ కుమార్, కార్తీక్ బాల సుబ్రమణియన్, టి.కార్తికేయశర్మ, ఎల్.నిహాంత్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుచితోరీ

## సమస్యల పరిష్కారానికి హ్యాకథాన్ వేదిక

**భీమవరం:** నేటి సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి హ్యాకథాన్ ఒక వేదికగా నిలవాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. కళాశాల టెక్నాలజీ సెంటర్ ఆధ్వర్యంలో 12 గంటలు నిర్విరామంగా నిర్వహించే హ్యాకథాన్ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. 2017లో ప్రధాని నరేంద్రమోడీ యువ మేధావులను ప్రోత్సహించేందుకు ప్రారంభించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమంలో ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఇప్పటికే జాతీయ స్థాయిలో రెండు సార్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ హ్యాకథాన్ పోటీలు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఇంటర్నల్ హ్యాకథాన్ కన్వీనర్ ఎం.సురేష్‌బాబు, కో-ఆర్డినేటర్ కురెళ్ల పవన్‌కుమార్, ఎం.శ్రీనివాస్‌వర్మ, శివ పవన్ కుమార్ రాజు, డి.శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జగపతిరాజు

## ఘనంగా ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు

**ఉండి:** దేశ ప్రధాని నరేంద్రమోడీ 74వ జన్మదిన వేడుకలను ఉండిలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొ కేక్ కట్ చేసారు. బీజేపీ నాయకులు గాదిరాజు వెంకటేశ్వరరాజు, యర్రా విక్రమ్,ఐఖ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

**స్వీట్లు పంపిణీ**

**పాలకోడేరు:** ప్రధాని నరేంద్రమోడీ పుట్టినరోజు వేడుకలను బీజేపీ నాయకులు గొరగనమూడిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. జిల్లా ఎస్సీ మోర్చ బీజేపీ నాయకులు ఇంజేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## దళిత వాడలను అభివృద్ధి చేయాలి

**భీమవరం:** రాష్ట్రంలో అంబేద్కర్ ఆశయాలను కొనసాగించేలా దళిత వాడలను అభివృద్ధి చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. భీమవరంలో మంగళవారం మాల మహానాడు జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా దళితవాడలు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా దళితవాడల్లో డ్రైనేజీలు, రోడ్లు, మంచినీటి సౌకర్యం కమ్యూనిటీ హాల్స్ లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పూర్తిగా ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలని పుష్పరాజ్ అన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నేతల సువర్ణరాజు, జిల్లా అధ్యక్షుడు ఇంటి సుందర్ కుమార్, నేతలు సాల్మన్‌రాజు, దాసరి చిరంజీవి, పిట్టా వినోద్ కుమార్ పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

# నులిపురుగుల్ని నులిమేద్దాం

**ఆకివీడు:** అనారోగ్యం పాలు చేసే నులిపురుగుల్ని నిర్మూలించే విధంగా ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులు తప్పనిసరిగా వేసుకోవాలని ఎంపీపీ కఠారి జయలక్ష్మి పిలుపునిచ్చారు.అయిభీమవరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మంగళవారం వేశారు. ఎంపీడీఓ కె.వాణి, సర్పంచ్ గాలి సామ్రాజ్యం, హెచ్ ఎం ఎస్. వెంకటేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. పెదకాపవరం పీహెచ్‌సీ సీహెచ్ఓ ప్రసాద్ మాట్లాడుతూ 12 సచివాలయాల్లోని 46 అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు, 44 స్కూళ్లు, కాలేజీతో కలిపి మొత్తం 5,751మంది పిల్లలల్లో 5,504మందికి మాత్రలు వేసినట్లు చెప్పారు.



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న దృశ్యం

**నులిపురుగును నిర్మూలించాలి**

**ఉండి:** కడుపులోని నులిపురుగులను నివారించకుంటే మన ఆరోగ్యం ప్రమాదంలో పడినట్టేనని తహసీల్దార్ కే నాగార్జున అన్నారు. మంగళవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని 2 నుంచి 19 ఏళ్లలోపు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు.ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని 5,171 మంది విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేస్తామని వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వినాయకుడు, సీహెచ్ఓ ఆర్ కృష్ణకుమార్, పీహెచ్ఎన్ ఎప్సీకుమారి పాల్గొని విద్యార్థులకు మాత్రలు అందించారు.

**ఆల్బెండజోల్‌తో రక్తహీనత నివారణ**

**భీమవరం అర్బన్:** పిల్లల్లో నులి పురుగుల వలన రక్త హీనతకు దారి తీసి, అనారోగ్యం పాలవుతారని నులి పురుగులను కడుపులోనే నులిమేద్దామని ఎంపీహెచ్ఈవో కె.అప్పారావు అన్నారు. భీమవరం మండలం గొల్లవానితిప్పలో జిల్లా పరిషత్ హైస్కూల్లో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా ఎంపీహెచ్ఈవో అప్పారావు మాట్లాడుతూ కడుపులో నులి పురుగులు ప్రబలకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. మండలంలో 36 పాఠశాలలు, 38 అంగన్‌వాడీ సెంటర్లలో 10 వేల 346 మంది విద్యార్థులు ఉన్నారని ఒక్క రోజులోనే 9 వేల 828 మందికి అల్బెండజోల్ మాత్రలు మింగించామన్నారు. సీహెచ్‌వో రత్నకుమారి ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

**ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ**

**వీరవాసరం:** జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మంగళవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల విద్యార్థులకు మాత్రలు ఇచ్చామన్నారు. రెండు సంవత్సరాల లోపు పిల్లలకు 200 ఎంజీ టాబ్లెట్, అంతకు మించి వయసున్న వారికి 400 ఎంజీ టాబ్లెట్ వేసుకోవాలన్నారు. కడుపులోని నులిపురుగుల వల్ల రక్తహీనత, బరువు తగ్గడం, అనారోగ్యాలకు గురవుతారన్నారు. ఎంఈవో అధికారి శ్రీమన్నారాయణ, సీహెచ్‌వో దేవదాసు, వీరవాసరం సర్పంచ్ చికిలే మంగతాయారు, గుండా రామకృష్ణ పాల్గొన్నారు.